ప్రార్థనలు ప్రశాంతం



శాలిబండ: మక్కా మసీదులో శుక్రవారం సామూహిక ప్రార్థనలు ప్రశాంతంగా జరిగాయి. మాజీ కార్పొరేటర్ మోసిన్ బలాలతోపాటు ముస్లింలు పెద్ద ఎత్తున నమాజ్‌కు హాజరయ్యారు. దక్షిణ మండల పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

శ్రీనివాస్‌రావుకు సన్మానం



శ్రీనివాసరావును సన్మానిస్తున్న రాకేష్ తివారి తదితరులు

చార్మినార్: సీఐడీ విభాగంలో డీఎస్పీగా ఉన్న సాహిని శ్రీనివాస్‌రావు ఇండియన్ పోలీస్ మెడల్ అవార్డు అందుకోవడం అభినందనీయమని సుల్తాన్ షాహి జగదాంబ ఆలయ కమిటీ చైర్మన్ రాకేష్ తివారి కొనియాడారు. ఆయన ఇప్పటి వరకు చేసిన సేవలకు గుర్తింపుగా సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డును అందుకోవడం అభినందనీయమన్నారు. శుక్రవారం సుల్తాన్ షాహి లోని జగదాంబ ఆలయం వద్ద ఆలయం కమిటీ ఆధ్వర్యంలో ఆత్మీయ అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా రాకేష్ తివారి ఆయనను గజమాలతో సత్కరించారు. ఆయన మాట్లాడుతూ..2003లో మొగల్ పురా పోలీస్ స్టేషన్లో ఎస్ఐగా విధి నిర్వహణ కొనసాగిస్తున్న కీలక సమయంలో ఆయన ప్రదర్శించిన తీరు అభినందనీయమన్నారు. వేణుగోపాల్, శశాంక్ తివారి, నరసింహ ముదిరాజ్, కిట్టు ముదిరాజ్, అనంతోజ్ హన్స్ రాజ్, బాబురావు పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దిన వేడుకలు



సాక్షి, సిటీబ్యూరో: ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా సంస్థ కార్యాలయం వేదికగా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. సంస్థ తెలంగాణ రీజియన్ జనరల్ మేనేజర్ జీఎస్ రాజు జెండా ఎగురవేయగా ఈ కార్యక్రమంలో డీజీఎంలు, ఏజీఎంలు, మేనేజర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్యం సాధించడానికి మహనీయులు చేసిన ప్రాణదానాలను జీఎస్ రాజు కొనియాడారు. అనంతరం ఫుడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలోని నిరంతర కృషి గురించి వివరించారు.

కోట్ల విజయభాస్కర్‌రెడ్డికి నివాళి



అబిడ్స్: మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన చిత్రపటానికి టీపీసీసీ కార్యదర్శి మనిలాల్‌షా, నాయకులు ప్రేమ్‌లత అగర్వాల్, కృష్ణలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రాణీ అవంతీబాయి ఆశయ సాధనకు కృషి చేయాలి



నివాళులర్పిస్తున్న సోమ్‌రాజ్‌సింగ్, రాజేష్ సింగ్ తదితరులు

అబిడ్స్: రాణీ అవంతీబాయి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జుమ్మేరాత్‌బజార్‌లోని ఆమె విగ్రహానికి బీజేపీ నాయకులు సోమ్‌రాజ్‌సింగ్, బీజేవైఎం కన్వీనర్ నితిన్ నందకర్, లోధ్‌కులస్తుల నాయకులు రాజేష్‌సింగ్, కార్పొరేటర్ లాల్‌సింగ్, మాజీ కార్పొరేటర్ పరమేశ్వరీ సింగ్ పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె దేశంకోసం చేసిన సేవలను కొనియాడారు.

వరద నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు



యాకుత్‌పురా: భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో వరద నీటి సమస్యలు తలెత్తకుండా అన్ని డ్రైనేజీ మ్యాన్‌హోల్స్, నాలాల పూడికతీత మరమ్మతు పనులు చేపట్టామని తలాబ్‌చంచలం కార్పొరేటర్ సమీనా బేగం తెలిపారు. శుక్రవారం ఆమె డివిజన్‌లోని తలాబ్‌కట్టా, నషేమన్ నగర్, చాచాగ్యారేజ్, సిద్దిఖీనగర్ ప్రాంతాల్లో పర్యటించి పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..వర్షాకాలం సందర్భంగా వరద నీటి సమస్యల రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. బస్తీలు, ప్రధాన రోడ్లల్లో ఏర్పడిన గుంతలకు ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టామన్నారు.

'జూడా'ల భారీ ర్యాలీ



సుల్తాన్‌బజార్: కోల్‌కతా వైద్యురాలిపై జరిగిన హత్యాచారం, హత్యకు నిరసనగా తెలంగాణ జూనియర్ డాక్టర్ల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కోఠి ఉస్మానియా మెడికల్ కళాశాల నుంచి వందలాది మంది జూనియర్ డాక్టర్లు మోజంజాహీ మార్కెట్‌గా, ఉస్మాన్‌గంజ్, సిద్దిఅంబర్‌బజార్ నుంచి ఉస్మానియా ఆసుపత్రికి భారీ ర్యాలీగా తరలివచ్చారు. వైద్యురాలి హత్య నిందితులను కఠినంగా శిక్షించాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

విద్యార్థి దశలోనే గుర్తించాలి

చార్మినార్: విద్యార్థి దశలోనే డ్రగ్స్ వాడకాన్ని గుర్తించి వారి తల్లిదండ్రులను అప్రమత్తం చేయాలని తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య అన్నారు. కాన్ఫిడరేషన్ ఆఫ్ మైనార్టీ ఇనిస్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉర్దూ మస్కాన్‌లో పాఠశాలలు, కాలేజీల ప్రిన్సిపాల్స్, హెడ్మాస్టర్ లతో అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ఏమాత్రం మార్పులు కనిపించినా వెంటనే పసిగట్టా లని కోరారు. రిటైర్డ్ డీజీపీ ఎస్ ఏ హుదా తదితరులు పాల్గొన్నారు.

వరలక్ష్మీ నమోస్తుతే..

- భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతాలు
- కిటకిటలాడిన ఆలయాలు



లక్ష్మీదేవీ రూపంలో మీరాలంమండి అమ్మవారు



చార్మినార్ భాగ్యలక్ష్మీ అమ్మవారు

చార్మినార్: శ్రావణ శుక్రవారం జరిగిన వరలక్ష్మి వ్రతం పూజల్లో భక్తులు అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చార్మినార్, బహదూర్‌పురా, చాంద్రాయణగుట్ట, యాకుత్‌పురా తదితర నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో పండుగ వాతావరణం కనిపించింది. భాగ్యలక్ష్మి ఆలయంలో అమ్మవారి దర్శనం కోసం భక్తులు భారీ సంఖ్యలో క్యూ కట్టారు. మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో అమ్మవారికి పూజలు ఘనంగా జరిగాయి. ఆయా ప్రాంతాలకు చెందిన మహిళలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

వెల్లివిరిసిన మతసామరస్యం..

పాతబస్తీలో శుక్రవారం ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఒకవైపు వరలక్ష్మి పూజల సందర్భంగా భక్తులు భాగ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా.. మరోవైపు మక్కా మసీదులో ముస్లింలు సామూహిక ప్రార్థనలు నిర్వహించడంతో పాతబస్తీలో మతసామరస్యం వెల్లివిరిసింది. దక్షిణ మండలం పోలీసులు గట్టి బందోబస్తు కొనసాగించారు.

విజయనగర్‌కాలనీలో..

విజయనగర్‌కాలనీ: వరలక్ష్మి దేవికి శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని మహిళలు వ్రతాలు నిర్వహించారు. ఆసిఫ్‌నగర్ జగదాంబ ఆలయం



గౌలిగూడలో..

, దాయిబాగ్ హనుమాన్ బాలాజీ మందిరం, విజయనగర్‌కాలనీ లక్ష్మీగణపతి ఆలయం, హనుమాన్ ఆలయం, ఆసిఫ్‌నగర్ నీలకంఠేశ్వర ఆలయాలలో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. బస్తీలు, కాలనీలలో మహిళలు ముత్తైదువులను ఆహ్వానించి వరలక్ష్మి వ్రతాలు నిర్వహించి అనంతరం వాయనాలు ఇచ్చి తమ పసుపుకుంకుమలు చల్లగా ఉండాలని ఆశీర్వాదం పొందారు. పలు ఆలయాల్లో అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

గుడిమల్కాపూర్‌లో..

గోల్కొండ: వరలక్ష్మి వ్రతాలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. మెహిదీపట్నం, గుడిమల్కాపూర్ తదితర ప్రాంతాల్లో మహిళలు వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు.

గౌలిపురాలో..

గౌలిపురా: గౌలిపురాలోని సరస్వతీ విద్యా మందిర్ పాఠశాలలో శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహించారు. ఈ పూజల్లో దాదాపు 50 మంది మహిళలు పాల్గొన్నారు. సామూహిక వ్రతాలు జరుపుకోవడంతో సమాజంలో ఆధ్యాత్మిక చింతన పెరుగుతుందని పాఠశాల ప్రధానాచార్యులు సరిత తెలిపారు.

గౌలిగూడలో..

గన్‌ఫౌండ్రీ: గౌలిగూడలో శుక్రవారం మహిళా సంఘం నాయకులు సంతోషి, జ్యోతి, రజిని, వర్షా, మాధవి, హర్షిత, వైష్ణవి వరలక్ష్మి వ్రతం పూజలు చేపట్టారు. స్థానికంగా భక్తులు పాల్గొని పూజలు చేశారు.



భాగ్యలక్ష్మీ ఆలయం వద్ద..



ఆసిఫ్‌నగర్‌లో..



వరలక్ష్మి వ్రతంలో వాణిశ్రీ



సరస్వతీ విద్యా మందిర్ పాఠశాలలో..



సంజయ్‌నగర్‌లోని నల్ల పోచమ్మ ఆలయంలో..

నేడు కాయిన్స్-కరెన్సీ ఎగ్జిబిషన్ ముగింపు

చార్మినార్: పాతబస్తీ మొగల్‌పురాలోని ఉర్దూ ఘర్‌లో అరుదైన కాయిన్స్, కరెన్సీలతో పాటు పురాతన వస్తువులతో కూడిన ప్రత్యేక ఎగ్జిబిషన్ శనివారం సాయంత్రం ముగియనుంది. ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా అల్ ఇండియా చార్మినార్ ఎగ్జిబిషన్ ఆఫ్ కాయిన్స్ అండ్ కరెన్సీ ఇన్ హైదరాబాద్ పేరుతో ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్ మూడు రోజుల పాటు కొనసాగింది. నిజాం కరెన్సీతో పాటు బ్రిటిష్ కరెన్సీకి సైతం ఇప్పటికీ డిమాండ్ ఉందనే విషయం ఈ ఎగ్జిబిషన్ ద్వారా స్పష్టమైంది. ఉదయం 10 నుంచి రాత్రి 7 గంటల వరకు కొనసాగిన ఈ ఎగ్జిబిషన్‌లో రెండు రోజుల్లోనే రూ.50 లక్షల వరకు వ్యాపారం జరిగిందని ఏపీజే అబుల్ కలాం వెల్ఫేర్ అసోసియేషన్ డైరెక్టర్ సిరాజుద్దీన్ తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో ప్రపంచ వ్యాప్తంగా 50 దేశాలకు సంబంధించిన పురాతన నాణేలు, నోట్లు అందుబాటులో ఉంచారు.



ఉర్దూ ఘర్‌లో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ప్రజలు

నిజాం కాలం నాటి కరెన్సీ, కాయిన్స్‌కు డిమాండ్..

కాగా నిజాం కాలంలోని ఏ కరెన్సీకైనా డిమాండ్ ఉంది. అసఫ్ జాహీ పాలకులలో 6వ నిజాం మహబూబ్ అలీ ఖాన్ (1869-1911) కాలంలోని కరెన్సీకి ప్రజల్లో క్రేజీ ఉంది. ఆయన మరణానంతరం అధికారం చేపట్టిన ఆయన కుమారుడైన 7వ నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్(1911) కాలంలోని కరెన్సీకి డిమాండ్ ఉంది. వీరి పీరియడ్‌లో నోట్లతో పాటు కాయిన్స్‌పై మా అని రాసి ఉంటే.. మహబూబ్ అలీ ఖాన్ అని.. ఐన్ అని రాసి ఉంటే ఉస్మాన్ అలీ ఖాన్ అని అర్థం ఉంటుందని.. ఈ రెండు కరెన్సీలలో మహబూబ్ అలీ ఖాన్ కరెన్సీకి ప్రజల్లో చాలా క్రేజీ ఉన్నదని ఎగ్జిబిషన్ నిర్వాహకులు చెబుతున్నారు. లక్షల రూపాయలు వెచ్చించి నిజాం కాలం నాటి కరెన్సీ ఖరీదు చేస్తున్నారని నిర్వాహకులు తెలిపారు.

ఐసీబీఎంలో ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం



గోల్కొండ: వినూత్నమైన ఆలోచనలు, విభిన్న ప్రాజెక్టుల తయారీతో విద్యార్థులను పోటీ పరీక్షలలో అగ్రగామిగా నిలపడంలో తమ సంస్థ ఎప్పుడు ముందుంటుందని ఐసీబీఎం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఎక్స్‌లెన్స్ చైర్మన్ ప్రొఫెసర్ ఎస్.జరార్ అహ్మద్ అన్నారు. శుక్రవారం రింగ్ రోడ్‌లోని ఐసీబీఎంలో ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం జరిగింది. ఈ కార్యక్రమంలో వంద మంది విద్యార్థులు 15 టీమ్‌లుగా ఏర్పడి వివిధ రకాల ప్రాజెక్టులను తయారు చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..15 ఏళ్లుగా తమ సెంటర్ దేశంలోనే అగ్రగామి సంస్థగా కృషి చెందిందన్నారు. ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలు నిర్వహించడం వల్ల వారిలోని ప్రతిభ ఆలోచన సరళి పెంపొందింతుందన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ఎన్విరాల్‌మెంటల్ ఫీజబుల్ ప్యాకేజింగ్, ట్రాన్స్‌పోర్ట్స్ మాడల్ ఫర్ అగ్రికల్చర్ గూడ్స్ ఈవెంట్ మెనేజ్‌మెంట్ బిజినెస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

స్వచ్ఛంద సంస్థల కృషి హర్షణీయం

జియాగూడ: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థలు సహకారం అందించడం హర్షణీయమని కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ సునీల్ అన్నారు. జియాగూడ న్యూ గంగానగర్‌లోని మంగళ్‌హాట్ ప్రభుత్వ ప్రైమరీ, ఉన్నత పాఠశాలల్లో క్రితి ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు ఎడ్యుకేషనల్ కిట్లను అందజేశారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ..విద్యార్థులు ఉన్నత చదువులకు ఎదగాలని పేర్కొన్నారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్‌నాయక్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరినారాయణ, ఉపాధ్యాయులు అశోక్, బాలకృష్ణ, షెడ్రక్, శ్రీనివాస్, శ్యామల, భాగ్యరేఖ, శారద, న్యూ గంగానగర్ బస్తీవాసులు పాల్గొన్నారు.



ఎడ్యుకేషన్ కిట్లను అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ సునీల్

పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రముఖ రచయిత రాజులపల్లి ప్రతాప్ రచించిన మూడోచెవి పుస్తకావిష్కరణ సభ శుక్రవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా సినీ నటుడు తనికెళ్లభరణి మాట్లాడుతూ..పుట్టుకతో చెవిటి పిల్లలకు మాటలు ఎలా నేర్పించాలి అనే అంశంపై పుస్తకాన్ని తీసుకురావడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం పలువురు పిల్లలకు ఉచితంగా పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ కె.ప్రభాకర్‌రెడ్డి, ఇ.రామసుబ్బారెడ్డి, హన్మంతరాయుడు, తెలుగు కళాసమితి ప్రధాన కార్యదర్శి మాదిరెడ్డి కొండా రెడ్డి, ప్రముఖ కన్నడ రచయిత రవీంద్రభట్, మాటలు నేర్చిన విజేత నీరంజన్ పాల్గొన్నారు.

కేటీఆర్ మహిళలకు క్షమాపణలు చెప్పాలి



వెంకటేశ్

గౌలిపురా: కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు కల్పించిన ఉచిత బస్సు ప్రయాణంతో ప్రజల్లో వచ్చిన ఆదరణను చూసి ఓర్వలేక బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ మహిళ సమాజ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా మాట్లాడుతున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, చార్మినార్ నియోజకవర్గం మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్ అన్నారు. కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని పేర్కొన్నారు. తెలంగాణ మహిళలకు క్షమాపణలు చెప్పకపోతే మహిళలందరితో కలిసి కేటీఆర్ నివాసాన్ని ముట్టడిస్తామని వెంకటేష్ హెచ్చరించారు.

మందకృష్ణ మాదిగకు ఘన స్వాగతం



గన్‌ఫౌండ్రీ: సుప్రీంకోర్టులో ఎస్సీ వర్గీకరణ సాధించి న్యూ ఢిల్లీ నుంచి నగరానికి తిరిగి వచ్చిన మహాజన నేత మందకృష్ణ మాదిగకు గోషామహల్ నియోజకవర్గానికి చెందిన గ్రేటర్, రాష్ట్ర ఎమ్మార్పీఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. పూజలోల్ల రవి మాదిగ, శివ మాదిగ, శ్రీనివాస్ మాదిగలతో పాటు పలువురు నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం చెప్పారు.

అధికారుల పనితీరు మెరుగుపర్చుకోవాలి

గోల్కొండ: అధికారులు తమ పనితీరు మెరుగుపర్చుకోవాలని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన నానల్‌నగర్ డివిజన్ హకీంపేట్‌లోని తన కార్యాలయంలో నానల్‌నగర్, గోల్కొండ డివిజన్‌ల బల్దియా అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు సమర్థవంతంగా పని చేస్తే అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి అవుతాయన్నారు. తమ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తుండాలని, దీనివల్ల పనులు సకాలంలో పూర్తి కావడంతో పాటు పనుల్లో నాణ్యత కూడా పెరుగుతుందన్నారు. అధికారులు కార్యాలయాలకే పరిమితం అయితే కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు నిర్వహిస్తారని దీన్ని వల్ల ప్రజలు ఇబ్బందులు పడతారన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, ఈఈ వెంకటశేషయ్య, డిప్యూటీ ఈఈ రామకృష్ణ, టోలిచౌకీ డివిజన్ మజ్లిస్ అధ్యక్షులు హారూన్‌ఫరాన్ తదితరులు పాల్గొన్నారు.



బల్దియా అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

నకిలీ పోలీసు అధికారి అరెస్టు

గన్‌ఫౌండ్రీ: అంతర్రాష్ట్ర నకిలీ పోలీసును శుక్రవారం సెంట్రల్ జోన్ పోలీసులు బేగంబజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. బీదర్‌లోని ఇరానీగల్లీ నివాసి అయిన జాఫర్ అలీ (36) ఇరానీ గ్యాంగ్ సభ్యుడు. హైదరాబాద్‌లోని పలు వ్యాపార ప్రాంతాల్లో నగదును తీసుకు వెళ్తున్నట్లు కనిపించే వ్యక్తులను లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతుంటారు. శుక్రవారం బేగంబజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తిని మోసం చేయడానికి ప్రయత్నిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. కర్ణాటకకు చెందిన నకిలీ పోలీసు ఐడీ కార్డును చూపించి అనుమానాస్పద పదార్థాల కోసం సాధారణ తనిఖీలు నిర్వహిస్తున్నామని బాధితుడికి తెలిపి కరెన్సీ నిజమో కాదో పరిశీలించాలి అంటూ వారి వద్ద ఉన్న నగదును దొంగిలించే ప్రయత్నం చేయగా పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతని వద్ద నుంచి రూ.95 వేల నగదు, నకిలీ పోలీసు ఐడీకార్డు, మొబైల్ ఫోన్లు, ఒక బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జాఫర్ అలీపై తెలంగాణతో పాటు కర్ణాటకలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు అయినట్లు పోలీసులు తెలిపారు.

డోర్ సమాజ్‌ను ప్రభుత్వం ఆదుకోవాలి

జియాగూడ: సామాజిక ఆర్థికంగా విద్య ఉపాధి పరంగా వెనుకబడి ఉన్న డోర్ సమాజ్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని జియాగూడ వీర శైవ కక్కయ్య సమాజ్ సలహాదారుడు వినోద్ చౌగ్లే, చైర్మన్ తులసిదాస్, అధ్యక్షుడు దత్తు పాల్, ప్రధాన కార్యదర్శి రాజేందర్ గజరే, బాగవాన్ దాస్, రమేష్ చౌగ్లే అన్నారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వ టూరిజం ప్లాజాలో ఏర్పాటైన ఎస్సీ వర్గీకరణ కమిటీ సమావేశంలో జియాగూడ డోర్ సమాజ్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..తెలంగాణలో 100 ఏళ్లుగా వివిధ జిల్లాల్లో స్థిరపడి ఉన్నామని, పూర్తిగా చర్మ వృత్తులపై ఆధారపడి ఉపాధి పొందామన్నారు. ప్రస్తుతం వాటి స్థానంలో ప్లాస్టిక్, రబ్బర్‌లతో పాటు వస్తువులు తయారు కావడంతో తమకు పనిలేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని ఆదుకోవాలని కోరారు.



వినతిపత్రం ఇస్తున్న డోర్ సమాజ్ ప్రతినిధులు వినోద్ చౌగ్లే

ఘనంగా ఆలయ ద్వితీయ వార్షికోత్సవం



చండీహోమం నిర్వహిస్తున్న ఆడాల శివకుమార్ దంపతులు

చాంద్రాయణగుట్ట: ఉప్పుగూడ వినాయకనగర్‌లోని బంగారు మైసమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆడాల శివకుమార్, కరుణ దంపతులు చండీ హోమం, మహాభిషేకం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అశోక్ కుమార్, విజయలక్ష్మి, నిఖిల్ కుమార్, పవన్ కల్యాణ్, కృష్ణ, హరికృష్ణ, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాల అందజేత



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యాశాఖ ఉద్యోగులతో కేఆర్.రాజ్‌కుమార్

గన్‌ఫౌండ్రీ: 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విద్యాశాఖ ఉద్యోగులు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందుకున్నారు. హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కేఆర్.రాజ్‌కుమార్, అనురాధ, సీనియర్ అసిస్టెంట్‌లు ఎం.భాస్కర్, సాజీద్ ఉత్తమ సేవలకు గాను ప్రశంసా పురస్కారాలను అందుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం డీఈఓ కార్యాలయంలో వారిని పలువురు ఉద్యోగులు అభినందించారు. తన సేవలను గుర్తించి పురస్కారాలను అందించడంపై కేఆర్.రాజ్‌కుమార్ ఆనందం వ్యక్తం చేశారు.

బస్సులో చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు

అఫ్జల్‌గంజ్: ఆగి ఉన్న బస్సులే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న పాత నేరస్తుడిని అఫ్జల్‌గంజ్ పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 15 తులాల బంగారం, 22 తులాల వెండి నగలను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి, అదనపు డీసీపీ నర్సయ్య, సుల్తాన్ బజార్ ఏసీపీ శంకర్, అఫ్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ లింగేశ్వర్‌రావు, డీఐ మధుసూధన్‌తో కలిసి మాట్లాడారు. సిద్దిపేట జిల్లాకు చెందిన సంపత్‌రెడ్డి (48) రియల్ ఎస్టేట్ వ్యాపారి. తన భార్యతో కలిసి నగరంలోని అల్వాల్‌లో నివాసముంటున్నాడు. జులై 23న గోదావరిఖనికి చెందిన సరితా చికిత్స నిమిత్తం నగరానికి రాగా తిరుగు ప్రయాణం కోసం ఎంజీబీఎస్‌లో తన బ్యాగులను బస్సులో పెట్టి తన తమ్ముడితో మాట్లాడేందుకు కిందకు దిగింది. సంపత్ రెడ్డి ఆమె బ్యాగులో నుంచి బంగారు, వెండి నగలను తీసుకొని అక్కడి నుంచి పరారయ్యారు. ఇంటికి చేరుకున్న తర్వాత బ్యాగులో నగలు లేవని విషయం గ్రహించిన ఆమె తన తమ్ముడు శ్రీకాంత్‌కు తెలుపగా అతను అఫ్జల్‌గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు బస్సులోని సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడి అదుపులోకి తీసుకున్నారు.

కాంగ్రెస్ నేతల నిరసన

చార్మినార్: మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకంపై కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం చార్మినార్, గుల్జార్ హౌస్ వద్ద నిరసన తెలిపారు. కేటీఆర్ దిష్టిబొమ్మ దగ్ధం చేసే ప్రయత్నం చేశారు. వీలు కాకపోవడంతో దిష్టిబొమ్మను కిందేసి చెప్పులతో కొడుతూ కాళ్లతో తొక్కారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ వలీవుల్లా సమీర్, కాంగ్రెస్ పార్టీ చార్మినార్ నియోజకవర్గ ఇన్‌చార్జి ముజీబుల్లా షరీఫ్, బహదూర్‌పురా ఇన్‌చార్జి రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

యాదవ హైయిర్ సమాజ్‌కు నామినేటెడ్ పదవులు ఇవ్వాలి



నిర్మల్‌కుమార్ యాదవ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

అబిడ్స్: యాదవ హైయిర్ సమాజ్ వారికి కాంగ్రెస్ ప్రభుత్వం నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని గోషామహల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ ఓబీసీ సెల్ ఆల్ ఇండియా కో ఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఉత్తర భారతీయులైన హైయిర్ యాదవ్ సమాజ్ కులస్తులకు చైర్మన్ పదవులు అప్పగించాలన్నారు. లక్షలాది మంది ఉన్న తమ కులస్తులు గత అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపుకు కీలక పాత్ర పోషించారన్నారు. యాదవ హైయిర్ సమాజ్ నాయకులు, కార్యకర్తలు ఆయన జన్మదినం సందర్భంగా సమావేశం నిర్వహించి ఘనంగా సత్కారం చేశారు. అనంతరం మాట్లాడుతూ..సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం యాదవ హైయిర్ సమాజ్‌కు నామినేటెడ్ పోస్టులు ఇచ్చే విధంగా కృషి చేయాలన్నారు. కేంద్రంలోని కాంగ్రెస్ అగ్ర నాయకులను ఇటీవలనే కలిసి మెమోరాండం సమర్పించామన్నారు.